
ప్రాణాలకు ఖరీదు

- నేరాలు చేసినా తప్పించుకు తిరుగుతున్న బడాబాబులు
- చాలా ఘటనల్లో పోలీసుల వైఖరి వివాదాస్పదం



న్యూస్‌టుడే, గద్వాల, మహబూబ్‌నగర్ నేర విభాగం

ఏదో ఒక పనిచేసుకుని జీవనం సాగించే బీదాబిక్కీ ప్రజలు అన్యాయానికి, అఘాయిత్యానికి గురైతే అండగా నిలవాల్సిన వ్యవస్థలు సరిగా స్పందించడం లేదు. నిందితులు రాజకీయ పలుకుబడితో పోలీసులను ఉపయోగించి, తప్పుడు కేసులు పెట్టి, భయపెట్టి నోరెత్తకుండా చేస్తున్నారు. బాధితులకు ఎంతో కొంత ముట్టజెప్పి వారి ప్రాణాలకు కూడా ఖరీదు కడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో అత్యాచార ఘటనలు, బాలికల ఆత్మహత్యలు, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం వికటించి చనిపోవటం, రోడ్డు ప్రమాద మరణాలు నిత్యకృత్యమవుతున్నాయి. బాధితుల్లో ఎక్కువ మంది నిరుపేదలే. ఘటనలపై ఎంత మంది గొంతెత్తినా, పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో కథనాలు వచ్చినా చివరికి డబ్బు, రాజకీయ పలుకుబడితే పైచేయి అవుతోంది. కసులు నీరు గారుస్తుండటం పరిపాటిగా మారింది. తాజాగా గద్వాల జిల్లాలో జరిగిన ఘటన చర్చనీయాంశమవుతోంది.

మచ్చుకు కొన్ని ఘటనలు..

- గద్వాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక చేయని నేరం మోపారని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎన్ని విమర్శలు వచ్చినా పోలీసులు అడుగు ముందుకు వేయలేదు. కీలక ప్రజాప్రతినిధి జోక్యంతోనే ఇలా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలి కుటుంబానికి పెద్దఎత్తున డబ్బు ఆశ జూపినట్లు ఆరోపణలు వచ్చాయి.
- ధరూరు మండలంలో కొద్ది రోజుల క్రితం ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఎన్నో అనుమాలు ఉన్నా కుటుంబ సభ్యులను ఒప్పించి చేసి ప్రమాదవశాత్తు చెరువులో మునిగినట్లుగా పోలీసులకు ఫిర్యాదు ఇప్పించారు.
- కేటీదొడ్డి మండలం ఉమిత్యాలలో యువకుల వేధింపుల కారణంగా ఓ బాలిక అత్యహత్యకు పాల్పడింది. సామాజిక మాధ్యమాలు, ప్రతికలు, ప్రసార మాధ్యమాల్లో కథనాలు వచ్చాక గానీ పోలీసులు స్పందించ లేదు. చివరికి ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో కూడా బాలిక ప్రాణానికి లెక్కలు గట్టి కేసును నీరుగార్చే ప్రయత్నంలో పెద్ద మనుషులు సఫలయ్యారు.
- గద్వాల మండలంలో ఓ యువకుడు వేధించటంతో అవమాన భారంతో బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. పరువుపోతుందని కుటుంబ సభ్యులు ఇతర కారణాలు చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ యువకుడు మాత్రం దర్జాగా తిరుగుతున్నాడు.
- గట్టు మండలంలో పేలుళ్లతో ఇతర రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతిచెందితే కంపెనీ ప్రతినిధులపై నామమాత్రంగా కేసులు నమోదు చేశారు.
- నాగర్‌కర్నూల్‌లో ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు యువకులు మృతిచెందగా ఇసుక మాఫియా మొత్తం రంగంలోకి దిగి వ్యవహారాన్ని చక్కబెట్టారు.
- దేవరకద్ర మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలే స్వయంగా ఈ విషయాన్ని చెప్పింది. అయినా ఒక్కరిపైనే కేసు నమోదైంది.
- కొల్లాపూర్ మండలంలోని ఓ తండాలో చెంచు మహిళను తీవ్రంగా కొట్టిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. చాలామందిపై ఆరోపణలు ఉన్నా, దాడి వీడియోలు బయటకు వచ్చినా కేసు మాత్రం ఒక్కరి పైనే నమోదు చేశారు.

ఆసుపత్రి మరణాలపై కేసులేవీ..

- గద్వాలలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో పది నెలల వ్యవధిలో వైద్యం వికటించి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. వైద్యులు బాధిత కుటుంబాలకు ఎంతో కొంత సొమ్ము ముట్టజెప్పి ఆస్పత్రులపై కేసులు కాకుండా చూసుకున్నారు.
- ఈ ఏడాది జులైలో ఓ మహిళ కడుపు నొప్పితో నాగర్‌కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రాగా వైద్యం వికటించి మృతి చెందింది. బంధువులు ఆందోళనకు దిగటంతో కొంత డబ్బు ముట్టచెప్పి వైద్యులు తమపై కేసు కాకుండా చేసుకున్నారు.
- నాగర్‌కర్నూల్‌లోని మరో ఆస్పత్రికి వచ్చిన మహిళకు రక్తం తక్కువగా ఉన్నా ఆపరేషన్ చేయటంతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రి ముందు ధర్నాకు దిగటంతో కొంత డబ్బిచ్చి నోరు నొక్కేశారు.

కల్తీ కల్లు మరణాలు ఎన్నో..: మహబూబ్‌నగర్‌లో కల్తీ కల్లు తాగి చాలా మంది ఆసుపత్రి పాలయ్యారు. ముగ్గురు మృతిచెందిన దినా ఆబ్కారీశాఖ కారణాలను కొట్టిపారేస్తూ కల్లు డిపోల నిర్వాహకులపై కేసు నమోదు కాలేదు. మానవపాడు మండలం లోని ఓ గ్రామంలో కల్తీ కల్లు తాగి ముగ్గురు మృతిచెందినా ఇలాగే చేశారు. బల్మూరు మండలం, జడర్ల పరిసరాల్లో కల్తీ కల్లు తాగి కొందరు మృతిచెందినా కేసులు నమోదు కాలేదు.

ప్రభుత్వానికి పేరొస్తుందనే రాద్ధాంతం

గ్రూప్-1 అభ్యర్థులను ప్రతిపక్షాలు రెచ్చగొట్టాయి : మంత్రి శ్రీధర్ బాబు



ఐటీఐ కళాశాలలో ఏటీసీకి శంకుస్థాపన చేస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి, వాకిటి, కలెక్టర్ విజయేందిర

పాలమూరు,. న్యూస్‌టుడే : రాష్ట్రంలో రాత పరీక్ష నిర్వహించి గ్రూప్-1 పోస్టులు భర్తీ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న భయంతోనే ప్రతిపక్షాలు అభ్యర్థులను రెచ్చగొట్టాయని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మండిపడ్డారు. మహబూబ్‌నగర్ పట్టణం మెట్టుగడ్డలోని ఐటీఐ ప్రాంగణంలో రూ.66 కోట్లతో ఏర్పాటు చేసే అధునాతన సాంకేతిక కేంద్రం(ఏటీసీ)కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రూప్-1 ఉద్యోగాల ప్రకటన ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చిందని, ప్రిలిమ్స్ పూర్తయి మెయిన్స్‌కు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాక ప్రతిపక్షాలు కుట్రలు చేశాయని ఆరోపించారు. పరీక్షకు నాలుగు రోజుల ముందు నుంచి అభ్యర్థులతో ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు చేయించాయని ఆరోపించారు. 9 నెలల నుంచి రాని అనుమానం.. ఇప్పుడు ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు. 2011లో తాము అధికారంలో ఉన్నప్పుడు వేసిన గ్రూప్-1 ప్రకటనతో అనేక మందికి ఉద్యోగాలు ఇచ్చామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో గ్రూప్-1 ప్రకటన ఇచ్చిందన్నారు. 500 పైచిలుకు ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. భారాస 10 ఏళ్లలో 40వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందని, అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 50 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత తమకు దక్కుతుందన్నారు. రాబోయే కాలంలో మరిన్ని ఉద్యోగ ప్రకటనలు ఇస్తామన్నారు. విద్యార్థులు డిగ్రీలు, పీజీలు చేసినా పరిశ్రమల్లో, ఇతర కార్పొరేట్ సంస్థల్లో తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడం లేదన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 65 ఐటీఐ కళాశాలలను రూ.2,300 కోట్ల నిధులు వెచ్చించి ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. టాటా సంస్థ సహకారంతో డిమాండ్ ఉన్న కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో బ్యాంకింగ్ రంగంపై ఆరు నెలల వ్యవధి కోర్సును ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ఐటీఐలో కొత్త కోర్సులు రావడం సువర్ణ అధ్యాయమన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారి ఎక్కువ భాగం తన నియోజకవర్గం గుండా వెళ్తోందని, అన్ని రకాల వసతులు ఉన్నందున పరిశ్రమలు కేటాయించాలని కోరారు. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ కృష్ణానది అవతలి వైపు థర్మల్ పవర్ స్టేషన్ ఉండటంతో అక్కడి నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కాయని, మనవైపు కూడా అలాంటిది ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మెట్టుగడ్డలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్మిస్తున్న భవన సముదాయాన్ని వారు పరిశీలించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, ముడా ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ ఛైర్‌పర్సన్ బెక్కరి అనిత, నాయకులు సంజీవ్ ముదిరాజ్, సిరాజ్ ఖాద్రి, జహీర్ అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

పశుగణన పకడ్బందీగా నిర్వహించండి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, అధికారులు

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే: 21వ జాతీయ పశుగణనను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికను కలెక్టర్, పశు సంవర్ధక శాఖ అధికారి మధుసూదన్‌గౌడ్, నోడల్ అధికారి డా. వెంకటేశ్వర్లు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లాలో శనివారం నుంచి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి వరకు ఈ కార్యక్రమాన్ని పశువైద్య శాఖ అధికారులు నిర్వహిస్తారన్నారు. ఇందుకు కేంద్రం ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ గణనకు ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన సిబ్బంది గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఇంటి యజమానితో పాటు ఎన్ని ఆవులు, పశువులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు ఉన్నాయో వివరాలు సేకరిస్తారన్నారు. వాటిని ఎలా పెంచుతున్నారు. వాటి నుంచి వస్తున్న ఆదాయం, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలుతో పాటు, పెంపకందార్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, ఇందుకు కావాల్సిన పరిష్కారాలు ఎంటి అనే విషయాలను వైద్య సిబ్బంది సేకరిస్తారన్నారు. ఈ పశు గణనకు ప్రజలు సహకరించాలని సూచించారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన



మద్దూరులో సీఎం పర్యటన ఏర్పాట్లను సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

మద్దూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నారాయణపేట జిల్లాలో పర్యటించనున్నారు. ఇటీవల మరణించిన కాంగ్రెస్ నాయకుడు కల్లపు సతీశ్ దశదినకర్మ సందర్భంగా సీఎం ఉదయం 11 గంటలకు మద్దూరుకు చేరుకోని సతీశ్ కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. నిడ్జింత రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని శుక్రవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎస్పీ యోగేశ్‌గౌతంలు పరిశీలించారు. ముఖ్యమంత్రికి స్వాగతం పలికే వారి కోసం ప్రత్యేకంగా టెంట్ ఏర్పాటు చేస్తున్నారు. హెలిప్యాడ్ దగ్గర జిల్లా అధికారులతో పాటు 10 మంది వరకు మాత్రమే ఉండాలని ఎస్పీ నాయకులకు సూచించారు. ఆర్‌అండ్‌బీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్తు,, అగ్నిమాపక, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. సీఎం వెళ్లే పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని కలెక్టరు అధికారులను ఆదేశించారు. కడా అధికారి వెంకట్‌రెడ్డి, అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్, ఆర్డీవో మధుమోహన్, కోస్గి సీఐ దస్రునాయక్, డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు నర్సిములు, రఘుపతిరెడ్డి ఏర్పాట్లను పరిశీలించిన వారిలో ఉన్నారు.

మహా ముడా ఆవిర్భావం

153 గ్రామాలు విలీనం చేసి జిల్లా మొత్తానికి విస్తరణ

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: ముడా (మహబూబ్‌నగర్ పట్టణాభివృద్ధి సంస్థ) ఇప్పుడు మహా ముడాగా అవతరించింది. భారాస ప్రభుత్వం 2022 ఫిబ్రవరి 14వ తేదీన జిల్లాలోని మహబూబ్‌నగర్, హన్వాడ, జడ్చర్ల, భూత్పూర్ పురపాలికలు, అడ్డాకుల, నవాబ్‌పేట, రాజాపూర్, మూసాపేట, దేవరకద్ర, కోయిలకొండ, గండీడ్, బాలానగర్ మండలాల్లోని 142 గ్రామాలు కలిపి ముడా ఏర్పాటు చేశారు. ఇప్పుడు మరో 153 గ్రామాలను విలీనం చేస్తూ ముడా పరిధిని విస్తరించారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో నంబర్ 175ను ఈనెల 15వ తేదీనే విడుదల చేసినా వివరాలు శుక్రవారం రాత్రి జిల్లా అధికార యంత్రాంగానికి చేరడం గమనార్హం.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం ప్రాజెక్టు (అమ్రాబాద్), న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. నిండు కుండలా మారిన జలాశయం నుంచి దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు 2 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర పైకెత్తి 55,782 క్యూసెక్కులు కుడి, ఎడమ జల విద్యుత్కేంద్రాల ద్వారా 67,006 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాయంత్రం 6 గంటలకు జలాశయంలో 884.60 అడుగులుగాను, నీటి నిల్వ 213.4011 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువన జూరాల ప్రాజెక్టు నుంచి 63,176 క్యూసెక్కులు, సుంకేశుల జలాశయం నుంచి 63,105 క్యూసెక్కుల ప్రవాహం జలాశయానికి చేరుకుంటోంది.

నిలువునా నష్టపోయాం

- ఇంకా ఎన్నిసార్లు పిలిచి తనిఖీ చేస్తారు?
- అధికారులపై మహిళల మండిపాటు



కోయనగర్ స్వయం సహాయక సంఘాల ఎంసీపీ దస్త్రాలు పరిశీలిస్తున్న లీడ్ బ్యాంకు మేనేజర్ కె.భాస్కర్

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : ఆర్పీ చేసిన మోసంతో తామంతా నిలువునా నష్టపోయాం.. ఇళ్లల్లో భర్త, కుటుంబ సభ్యులతో రోజూ గొడవలు జరుగుతున్నాయి.. పైసలు వచ్చే మార్గం చెప్పడం లేదు గానీ లెక్కలు చెప్పాలంటూ రోజూ కార్యాలయాల చుట్టూ తిప్పుతారా.. అంటూ కోయనగర్ స్వయం సహాయక సంఘాల మహిళలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కోయనగర్ స్వయం సహాయక సంఘాల మహిళల లెక్కా పద్దులు మరోమారు పరిశీలించేందుకు మెప్మా కమ్యూనిటీ భవనంలో లీడ్ బ్యాంకు మేనేజర్ కె.భాస్కర్ ఆధ్వర్యంలో మెప్మా డీఎంసీ శివకుమార్, టీఎంసీ వరలక్ష్మి, సీవోలు నిర్మల, ఆంజనేయులు, దేవమ్మ సమావేశం నిర్వహించారు. తొలిరోజు 10 సంఘాలకు చెందిన సుమారు 100 మంది మహిళలు హాజరయ్యారు. ఒక్కో సంఘం నుంచి బ్యాంకు లింకేజీ కింద రుణాల కోసం మహిళలు సమర్పించిన ఎంసీపీ దస్త్రాలు, బ్యాంకు నుంచి సంఘాల ఖాతాల్లో జమ అయిన రుణ డబ్బు తాలూకా స్టేట్‌మెంట్లను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఆసాంతం అధికారుల ఎదుట తమ అసంతృప్తిని, ఆవేదనను వ్యక్తం చేయడం గమనార్హం. తమ సంఘాల్లో రుణాల పేరిట దోపిడీకి పాల్పడిన ఆర్పీ దర్జాగా ఉన్నారని, ఆమెపై కేసు నమోదు చేశామని చెప్పడమే గానీ ఇంతవరకు పోలీసులు వచ్చి తీసుకెళ్లలేదని, డబ్బులు రికవరీ చేసే ఆలోచన అధికారులకు ఉన్నట్లు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోయనగర్ సమాఖ్యలో జరిగిన అవకతవకలపై ఇప్పటికే వారం, పది రోజుల పాటు తీర్మానాల దస్త్రాలు, ఎంసీపీ దస్త్రాలు, వ్యక్తిగత, సంఘాల బ్యాంకు ఖాతాలను సీవోలు, ఆర్పీల బృందం పరిశీలించి లెక్కా పద్దులు తేల్చిందని, మళ్లీ విచారణ జరపాలని తమను రప్పించడం ఏమీ బాగోలేదని మహిళలు అసహనం వ్యక్తం చేశారు. రూ. లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్న తమ కుటుంబాలు వీధిన పడితే, ఆర్పీ మాత్రం దర్జాగా ఇంట్లోనే ఉన్నారని, తమకు పైసలు ఎప్పుడు రికవరీ చేస్తారో చెప్పాలని లీడ్ బ్యాంకు మేనేజర్, సీవోలను నిలదీసినంత పనిచేయడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. లీడ్ బ్యాంకు మేనేజర్, సీవోలు మహిళలకు నచ్చజెప్పుతూ తనిఖీలు కొనసాగించాల్సి వచ్చింది. మూడు రోజుల క్రితం కోయనగర్ మహిళా సంఘాల వ్యవహారంపై పురపాలిక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, మెప్మా ఇన్‌ఛార్జి పీడీ సురేందర్‌రెడ్డి, మెప్మా డీఎంసీ శివకుమార్‌తో సమావేశమైన అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్... మరోమారు సంఘాల ఖాతాలను తమ పర్యవేక్షణలో తనిఖీ చేసి తుది నివేదిక తేల్చాలని ఆదేశించినట్లు సమాచారం. తనిఖీకి లీడ్ బ్యాంకు మేనేజర్ రాగా పుర కమిషనర్, మెప్మా ఇన్‌ఛార్జి పీడీ మాత్రం గైర్హాజరయ్యారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం : మంత్రి జూపల్లి

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధే లక్ష్యమని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని సోమశిల గ్రామంలో పర్యాటక ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం



సోమశిలలో పర్యటక బోటును ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, పురఛైర్‌పర్సన్ మేకల రమ్యకుమారి

కాటేజీలు, ఘాట్‌లను పరిశీలించి పర్యాటకులతో మాట్లాడారు. టూరిజం శాఖ బోటును ప్రారంభించి కృష్ణానదిలో విహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నదీ పరివాహక ప్రాంతాలను మల్లేశ్వరం వద్ద ఉన్న ఐ ల్యాండ్ ప్రాంతాన్ని, సింగోటం, జటప్రోలు, అమరగిరి ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధి చేస్తామన్నారు. అర్కిటెక్చర్ రాందేవ్‌రావుతో సోమశిల, కొల్లాపూర్ పట్టణంలోని రోడ్డు మధ్యలో ఉన్న విభాగినిని తీర్చిదిద్దుతామన్నారు. సోమశిలలోని వీఐపీ ఘాట్ సమీపంలో స్నానగదులకు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో పురపాలిక అధ్యక్షురాలు మేకల రమ్యకుమారి, కౌన్సిలర్ నయీం, మాజీ జడ్పీటీసీ హనుమంత్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలకు అవకాశం ఇవ్వమా?

- ఇన్‌స్పైర్ మనక్‌కు 3,858 రిజిస్ట్రేషన్లు
- ప్రైవేటు పాఠశాలల ప్రాతినిధ్యం అంతంతే



జాతీయ స్థాయి ప్రదర్శనలో వరి ధాన్యం అరబెట్టే పరికరం పనితీరు వివరిస్తున్న విద్యార్థిని

న్యూస్‌టుడే, నారాయణపేట పట్టణం

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని వెలికితీసి ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి మంత్రిత్వశాఖ ఏటా దేశ వ్యాప్తంగా నిర్వహించే ఇన్‌స్పైర్, మనక్ ద్వారా విద్యార్థుల్లో సృజనకు పదును పెడుతోంది. మనిషి జీవితంలో నిత్యం ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలు చూపించే ప్రాజెక్టులను ఆన్‌లైన్ ద్వారా ఆహ్వానిస్తోంది. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన వాటిని జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనలకు సైతం పంపుతారు. 2024-25 ఏడాదికి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని పలుమార్లు విద్యాశాఖ అవగాహన కల్పించినా చాలా మంది ముందుకు రాలేదు. ప్రైవేటు పాఠశాలల నుంచి కనీస స్పందన కొరవడుతోంది. కేవలం నాలుగు ప్రైవేటు పాఠశాలలే ఇందులో పాల్గొన్నాయని, ఎన్ని ఎక్కువ పాఠశాలలు ప్రాతినిధ్యం వహిస్తే అంత మేలు జరుగుతుందని నారాయణపేట జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాశ్ 'న్యూస్‌టుడే'తో అన్నారు.

2024 - 25లో నామినేషన్లు ఇలా..	
మహబూబ్‌నగర్	1061
వనపర్తి	1041
నాగర్‌కర్నూల్	847
గద్వాల	595
నారాయణపేట	315

తయారీ ఖర్చులకు రూ. 10 వేలు : అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 6 నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు గైడ్ టీచరు సహాయంతో ప్రాజెక్టు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ప్రతి పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులను పంపించాలి. ఎంపికైన విద్యార్థుల బ్యాంకు ఖాతాలో రూ. 10 వేలు జమ చేస్తారు. ఈ నిధులతో ప్రాజెక్టు తయారు చేసి జిల్లా స్థాయిలో ప్రదర్శించాల్సి ఉంటుంది. ఇక్కడ ప్రతిభ కనబరిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుంది.

రాష్ట్రపతి భవన్, జపాన్ సందర్శన : జాతీయ స్థాయికి ఎంపికైన వారికి రూ. 25 వేల ప్రోత్సాహకం అందజేస్తారు. అక్కడ ప్రతిభ చాటితే రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసే విందు భోజనానికి హాజరయ్యే అవకాశం లభిస్తుంది. ఈ ప్రాజెక్టుకు పేటెంట్ హక్కు కల్పిస్తారు. వీరికి దేశంలో పేరున్న ఐఐటీల్లో ప్రవేశాలకు రిజర్వేషన్ కల్పిస్తారు. అలాగే జపాన్ సందర్శనకు అవకాశం ఇస్తారు.

ఉమ్మడి జిల్లా నుంచి...: 2022-23 విద్యా సంవత్సరంలో నారాయణపేట నుంచి రెండు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. అచ్చంపేట సాయినగర్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అంజలి తయారు చేసిన ప్రాజెక్టు కూడా ఎంపికయ్యింది. వీరికి ప్రశంసలు వెల్లువెత్తాయి. 2023-24 లో ఎంపికైన ప్రాజెక్టులను ఈ ఏడాది ప్రదర్శనలకు ఉంచనున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా 66, వనపర్తి 54, మహబూబ్ నగర్ 5, జోగులాంబ గద్వాల 44, నారాయణపేట నుంచి 18 ప్రాజెక్టులు వివిధ స్థాయిలకు ఎంపికయ్యాయి.

వేతనాలు లేక వెతలు

● మూడు నెలలుగా పారిశుద్ధ్య కార్మికుల పరేషాన్

● పండగ వేళ అవస్థలు



పెద్దకొత్తపల్లిలో తెల్లవారుజామునే బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికులు

న్యూస్‌టుడే, కొల్లాపూర్ గ్రామీణం, కల్వకుర్తి : పల్లెల పరిశుభ్రతకు కీలకమైన పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలందడం లేదు. రెండు నెలలుగా అప్పులతో కాలం వెళ్లదీస్తున్నారు. దసరా పండగకు వేతనాలు రాకపోగా కనీసం దీపావళికైనా వస్తాయేనన్న ఆశతో కార్మికులు ఉన్నారు. సకాలంలో రాకుంటే పండుగకు పస్తులుండాల్సిందేనా అని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

● గ్రామపంచాయతీలకు ప్రస్తుతం నిధులు కూడా సరిగా రావటం లేదు. ఒప్పంద కార్మికులుగా నియమించుకున్నప్పటికీ పారిశుద్ధ్య కార్మికులకు నెలనెలా వేతనాలు అందడం లేదు. పంచాయతీల్లో పన్నుల వసూలు అంతంతమాత్రంగానే ఉంటోంది. దీంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారింది. నిత్యం శ్రమకోర్చి రహదారులు ఊడ్చటం, చెత్త తొలగింపు, మురుగు కాల్వల శుభ్రత వంటి పనులు చేపట్టడుతున్నా.. కార్మికులను విస్మరిస్తున్నారు. నిత్యం ఉపాధి హామీపనులకు హాజరైనా నెలకు దాదాపు రూ.6వేలకు పైగానే అందుకునే వీలుంది. పారిశుద్ధ్య కార్మికులు నిత్యం విధులకు వెళ్తున్నా సకాలంలో వేతనాల అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 7,420 మంది పారిశుద్ధ్యకార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి గత జులై వరకే వేతనాలు అందించారు. ఆగస్టు నుంచి ఇప్పటివరకు వేతనాలు ఇవ్వలేదు.

కార్యదర్శులపై ఒత్తిడి : రెండు నెలలుగా పంచాయతీలకు కూడా నిధులు సరిగా రావడంలేదు. దీంతో పంచాయతీల్లో ట్రాక్టర్ల నిర్వహణ, డీజిల్ కొనుగోలు, ఇతర ఖర్చులతోడై పంచాయతీలు అప్పుల కుప్పగా మారుతున్నాయని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఏర్పడిన చిన్న పంచాయతీలు 550 దాకా ఉన్నాయి. వీటి నిర్వహణ మరింత భారంగా మారింది. కొన్ని చోట్ల కార్యదర్శులు అప్పులు తెచ్చి పారిశుద్ధ్య కార్మికుల చేతి ఖర్చులకు ఇస్తున్నారు. ప్రస్తుతం సర్పంచులు లేకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలనలో కార్యదర్శులపై ఒత్తిడి పెరిగింది. నిధులు లేక వేతనాలు ఇవ్వలేక ఇబ్బంది పడాల్సి వస్తోంది.

ఉమ్మడి జిల్లాలో మొత్తం పంచాయతీలు **1,684**

పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు **7,420**

మూడు నెలల వేతన బకాయిలు **రూ.14.09 కోట్లు**

నిత్యం అప్పులతో..: రెండు నెలలుగా వేతనాలు లేక అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. గ్రామాల్లో పెద్ద పండుగ దసరా మా ఇళ్లల్లో చిన్నబోయింది.. దీపావళి కూడా జరుపుకొనే పరిస్థితి కన్పించడంలేదు. సరకులు కొందామన్నా ఆర్థిక ఇబ్బందులతో మా పరిస్థితి దయనీయంగా ఉంది.



- రాజేందర్, పెద్దకొత్తపల్లి పారిశుద్ధ్యకార్మికుడు

ఒక నెల సర్దుబాటు చేస్తాం..: పారిశుద్ధ్య కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం ఒక నెల వేతనాల నిధులు మంజూరయ్యాయి. వీటిని అందించేందుకు ఇప్పటికే ఆయా మండలాలకు వివరాలు పంపాలని సూచించాం. నివేదికలు రాగానే ప్రస్తుతానికి ఒక నెల వేతనాలు అందిస్తాం.

- రామ్మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి, నాగర్‌కర్నూల్

భావి తరం నిర్మాతలు మీరే

నవ, యువ గురువులారా.. అహర్నిశలు శ్రమించి.. పోటీని తట్టుకుని నిలబడి ఉత్తమమైన ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. భావి పౌరులను తీర్చిదిద్దే సువర్ణ అవకాశం మీ చేతుల్లోకి వచ్చింది. ఇతర శాఖల్లోని ఉద్యోగాలను సైతం వదులుకుని వచ్చిన వారూ మీలో ఉన్నారు. మనచుట్టూ ఉండే ఎంతోమంది గురువుల నుంచి అనుసరించిన పద్ధతులను మీరూ అలవరుచుకోవచ్చు. జీతం కోసమే ఉద్యోగం కాదు... ఎన్నో జీవితాలను బాగుచేసే యజ్ఞం చేస్తున్నారని గుర్తించండి.

- న్యూస్‌టుడే, కొల్లాపూర్, గద్వాల న్యూటౌన్

బడి బాట పట్టించండి

ఎంతో మంది చిన్నారులు వివిధ కారణాలతో బడి మానుకుంటున్నారు. కొందరు తల్లిదండ్రులతో వలస పోతే, మరి కొందరు పనులకు వెళ్తున్నారు. తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యాన్ని వివరిస్తూ బడికి పంపేలా ఒప్పించాలి.

● **ఉదాహరణ:** హన్వాడ పాఠశాలలో పనిచేస్తున్న జయప్రద ప్రతి వారం విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేలా ఆటలు, పాటలు సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నారు. పిల్లల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి బడికి పంపేలా చూస్తున్నారు.



హన్వాడలో పిల్లలను బడిబాట పట్టిస్తున్న ఉపాధ్యాయులు

కృత్యాధార బోధన

మామూలుగా చెప్పడం కన్నా కృత్యాలతో చేసి చూపిస్తే పిల్లల మనసుల్లో నాటుకుంటుంది. అందుకు కావలసింది ఓపిక, సృజనాత్మక ఆలోచనలే.

● మహబూబ్‌నగర్ జిల్లా వేపూరులో పనిచేస్తున్న దశరథరామిరెడ్డి కృత్యాలతో ఆకట్టుకుంటున్నారు. ఒక్కొక్క తరగతికి భిన్న నమూనాలను అమలు చేస్తున్నారు. ధన్వాడ, చిన్నచింతకుంట పాఠశాలల్లో అక్షరమాలలు, అట్టపెట్టలతో చతుర్విధ ప్రక్రియలను తయారు చేసి ఉపాధ్యాయులు బోధిస్తున్నారు.



వేపూర్‌లో విద్యార్థులతో మమేకమై బోధిస్తున్న దశరథరామిరెడ్డి

మంచి అలవాట్లు నేర్పించాలి

గురువులు ఏది అనుసరిస్తే విద్యార్థులు ఆ మార్గంలో పయనిస్తారు. ఎంతోమంది గొప్ప వ్యక్తులు తమ జీవితాలపై పాఠశాలలో గురువుల ప్రభావం ఉందని చెబుతారు. బాల్యదశలో మంచి అలవాట్లు నేర్పిస్తే పిల్లలు ఉన్నతంగా ఎదుగుతారు.

● **ఉదాహరణ:** ఊట్కూరు మండలం చిన్నపొర్ల పాఠశాలలో పనిచేస్తున్న నరేందర్ పిల్లలకు చదువు తప్ప ఇతర పనులు చెప్పకుండా తల్లిదండ్రులను చైతన్యపరిచారు. ఉదయం అయిదు గంటలకు లేచి చదువుకునేలా ప్రోత్సహించారు. ఇంతకు ముందు తాను పనిచేసిన మందిపల్లితండాలో 22 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికయ్యేలా తీర్చిదిద్దారు. వ్యక్తిగత పరిశుభ్రత, శ్రమ విలువ నేర్పారు.



చిన్నపొర్లలో బోధిస్తున్న నరేందర్

సామాజిక బాధ్యత చెప్పాలి

భవిష్యత్తు బాధ్యత వారిదే అనే విధంగా విద్యార్థులను సమాయత్తం చేయాల్సిన అవసరం ఉంది. విలువలు, సామాజిక బాధ్యత చెప్పాలి.

● వనపర్తి జిల్లా యూపీఎస్ ఉన్నత పాఠశాలలో శంకర్ గౌడ్ అమ్మానాన్నలకు నిత్యం పాదపూజ చేసి పాఠశాలకు రావాలని చిన్నారులకు సూచిస్తూ అలవాటుగా మార్చారు. బాల్య వివాహాన్ని అడ్డుకొని పోలీసులతో కలసి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇప్పారు. కోస్గి మండలం ముశ్రీఫా జడ్పీ ఉన్నత పాఠశాలలో వార్షిక ప్లాస్టిక్ నిషేధం, మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, పక్షుల సంరక్షణ వంటి పనులను ప్రత్యక్షంగా పిల్లలతో చేయిస్తున్నారు.





బాల్యవివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న శంకర్

ఇటీవల డీఎస్సీలో ఎంపికై కొత్తగా 951 మంది ఉపాధ్యాయులు ఉమ్మడి జిల్లాకు వచ్చారు..

జిల్లా	ఎస్‌ఏ	భాషా పండితులు	పీఈటీ	ఎస్‌జీటీ	స్పెషల్ ఎడ్యుకేషన్
మహబూబ్‌నగర్	35	22	07	144	06
నాగర్‌కర్నూల్	66	13	02	129	0
జోగులాంబ గద్వాల	34	26	08	77	04
నారాయణపేట	70	22	01	154	05
వనపర్తి	55	08	06	52	05

వృత్తికి న్యాయం చేయాలి

వృత్తికి కట్టుబడి ఉండాలి. ఎంతో నమ్మకంతో గురువుల చేతిలో పిల్లలను పెడతారు. తాను చేస్తున్నది ఉద్యోగం కాదని, సమాజ నిర్మాణంలో భాగస్వామ్యమని గుర్తించాలి.

● నాగర్‌కర్నూల్ జిల్లా చిన్నముద్దునూర్ పాఠశాలలో రాజశేఖర్‌రావు ఈ విషయంలో ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. ఈయన ప్రతి పిల్లాడిపై ప్రత్యేక శ్రద్ధపెట్టి ఎదిగేలా చూస్తున్నారు.



ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకుంటున్న రాజశేఖర్ రావు

ఆట,పాటలకు ప్రాధాన్యం



విద్యార్థులకు సైక్లింగ్ పోటీలను నిర్వహిస్తున్న భూపని గోపాల్

పిల్లలు ఆటలు దూరం కావడంతోనే నేడు ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయి. విద్యార్థుల్లో శారీరక దృఢత్వం ఉంటే వారు ఇష్టంగా చదువుపై ఆసక్తి కనబరుస్తారు.

● మక్తల్‌కు చెందిన భూపని గోపాల్ పనిచేసిన సమయంలో ఎంతోమందిని తీర్చిదిద్దారు. పదవీ విరమణ తరువాత వచ్చిన డబ్బుతో పేదపిల్లలను క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. జాతీయ స్థాయికి 62 మంది వెళ్లగలిగారంటే ఆయన నిబద్ధతను ప్రశంసించాల్సిందే. క్రీడాపాఠశాలకు 42 మంది విద్యార్థులు ఎంపికకావడానికి ప్రత్యేక శిక్షణ అందించారు. క్రీడాకారులకు తన సొంతఖర్చులతో పాటు దాతల నుంచి సేకరించిన నగదుతో అన్ని వసతులు సమకూర్చుతున్నారు.

ఇథనాల్ కంపెనీ సందర్శనను అడ్డుకున్న పోలీసులు



గుండ్లంపల్లి గ్రామస్థులను అడ్డుకున్న మరికల్ పోలీసులు

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఏర్పాటు చేయతలపెట్టిన ఇథనాల్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న గుండ్లంపల్లి గ్రామస్థులు నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ ఇథనాల్ ప్రాజెక్టును, పరిసర గ్రామాలను సందర్శించడానికి శుక్రవారం వచ్చారు. వంద మంది రెండు బస్సుల్లో వచ్చారని తెలుసుకున్న పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున మరికల్ పోలీసు స్టేషన్ వద్ద బస్సులను నిలిపేశారు. సందర్శనకు ఎలాంటి అనుమతి లేదంటూ బస్సుల్ని వెనక్కి మళ్లించి పోలీసు సహాయంతో జడ్చర్ల వరకు తీసుకెళ్లి వదిలేశారు. ఈ సంఘటనపై చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ పర్యటనను అడ్డుకోవడం ఏమిటని ప్రజాసంఘాల నాయకులు ఎం.రాఘవచారి, డి.చంద్రశేఖర్, ఎస్ఎం ఖలీల్, జె.చక్రవర్తి ప్రభుత్వాన్ని నిలదీశారు. పాలకులు మారినా పరిస్థితి మారలేదన్నారు. రాబోయే రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

పట్టుదలతో సాధన చేస్తే విజయం తథ్యం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి జట్టుకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో సాధన చేస్తే తప్పక విజయం వరిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీ బాలికల గురుకుల విద్యాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 క్రీడలు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుంచే క్రీడాసాధన చేస్తే శారీరకంగా, మానసింగా దృఢంగా ఉంటారని దాని వల్ల జీవితంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నా తట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. మొత్తం 16 పాఠశాలల నుంచి 540 మంది క్రీడాకారులు పోటీ పడినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, ఆర్డీవో వెంకట్‌రెడ్డి, కాలుష్య నియంత్రణా మండలి సభ్యుడు బాలాజీసింగ్, ప్రిన్సిపల్ నాగమణి, వ్యాయామోపాధ్యాయురాలు సింధు, ఫుట్‌బాల్ అసోషియేషన్ సభ్యుడు కేశవులు, కౌన్సిలర్‌లు బాలునాయక్, రవిందర్, నాయకులు సురేందర్‌రెడ్డి, సతీష్, సీఐ నాగార్జున పాల్గొన్నారు.

క్రీడ	విజేత	రన్నర్
కబడ్డీ	కల్వకుర్తి	తాడూర్
వాలీబాల్	కల్వకుర్తి	నర్వ
ఖోఖో	కల్వకుర్తి	ఉయ్యాలవాడ
చెస్	కల్వకుర్తి	వేపూర్
క్యారం	హన్వాడ	వెల్టూర్

విజేతలు వీరే..

మూడు రోజుల పాటు జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు హోరాహోరీగా జరిగాయి. అత్యధిక క్రీడల్లో కల్వకుర్తి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఓరల్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు.

బాలిక మృతిపై అనుమానాలెన్నో...!

ప్రభుత్వ వ్యవస్థల తీరుపై విమర్శలు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బాలిక ఆత్మహత్యలో అనేక అనుమానాలు, పలు కోణాలు వెలుగుచూస్తున్నాయి. దొంగతనం జరిగింది గద్వాలలో అయితే మల్దకల్ పోలీసుస్టేషన్‌లో ఎలా విచారించారనే దానికి సమాధానం దొరకడం లేదు. దొంగతనం, పోలీసుల విచారణ భయంతో అవమానంగా భావించి బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి కర్నూల్ ఆసుపత్రిలో మృతిచెందిన విషయం తెలిసిందే. బాలిక ఆత్మహత్యకు యత్నించిదనే విషయం బహిర్గతం కావడంతో తొలుత కార్మిక శాఖ, ఆ తరువాత జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలు స్పందించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఆయా శాఖల్లో స్పందన లేదు. దీనిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు విచారణ, కేసులు అంటున్నారు తప్పితే బాలికకు చట్టబద్ధంగా సంక్రమించిన హక్కులను విస్మరించారని పలువురు మహిళా సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. బాలికపై దొంగతనం అభియోగం మోపిన వెంటనే మైనర్లను పనిలో ఎలా పెట్టుకున్నారని ప్రశ్నించి ఉంటే ఈ రోజు బాలిక మృతిచెంది ఉండేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దిశగా పోలీసులు ఎందుకు విచారణ చేపట్టలేదనే విషయం వెలుగులోకి రావాల్సి ఉంది. గత కొంత కాలంగా జిల్లాలో అధికార వ్యవస్థలు నాయకుల పలుకుబడి ముందు చట్ట నిబంధనలు పనికి రానివిగా చేస్తున్నారని న్యాయనిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్నూల్ ఆసుపత్రికి వెళ్లాం: బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిన వెంటనే కమిటీ సభ్యులం కర్నూల్‌లో చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లాం. అప్పటికే బాలిక అపస్మారక స్థితిలో ఉంది. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగాం. వారు ఏమీ చెప్పలేమనడంతో వివరాలు నమోదు చేసుకుని తిరిగి వచ్చాం.

-సుధారాణి, జిల్లా సంక్షేమ అధికారిణి

29న ఎస్‌జీఎఫ్ అండర్-19 బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్లను ఈనెల 29న జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ మైదానంలో ఎంపికలు చేపడుతున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాపిరెడ్డి శుక్రవారం తెలిపారు. బోనఫైడ్, పదో తరగతి మార్కుల జాబితా జిరాక్స్‌తో ఉదయం 9గంటలకు కోచ్ ఖలీల్‌ను నివేదించాలని సూచించారు.

పోటీలే లక్ష్యంగా ఆడండి



జట్లతో క్రికెట్ సంఘం ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అంతర్ జిల్లాల అండర్-23 క్రికెట్ టోర్నీలో సత్తా చాటితే తప్పక రంజీ స్థాయికి ఎదగవచ్చని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఎండీసీఏ క్రికెట్ మైదానంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీ మూడో రోజు నాగర్‌కర్నూల్- వనపర్తి మధ్య నిర్వహించిన వన్డే మ్యాచ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటితే తప్పకుండా తుది జట్టులో చోటు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షుడు టి.సురేశ్ కుమార్, అశోక్, సభ్యులు గోపాలకృష్ణ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ విజయం: అండర్-23 అంతర్ జిల్లాల టోర్నీలో నాగర్‌కర్నూల్ జట్టు వనపర్తి జట్టుపై 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన నాగర్‌కర్నూల్ జట్టు 44.2 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌట్ అయింది. తరుణ్ 35, సాయిరాం 19, కృష్ణ 18 పరుగులు చేశారు. వనపర్తి బౌలింగ్‌లో ఛత్రపతి 4, దినేశ్, ప్రణీత్ రెడ్డి చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం వనపర్తి జట్టు 31 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌట్ అయింది. అభిషేక్‌గౌడ్ 56, ప్రణీత్ 34 పరుగులు చేశారు. నాగర్‌కర్నూల్ నుంచి అభినవ్ 4, జశ్వంత్ 2 వికెట్లు తీశారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



అండర్ 17 ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించిన పాత మక్తల్ ఎంజేపి బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు షీల్డ్ అందజేస్తున్న వనపర్తి జిల్లా బీసీ గురుకుల కన్వీనర్ మేఘారావు

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ఎంజేపీ సొసైటీ ఏటా వారికి జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తోందని వనపర్తి జిల్లా బీసీ గురుకుల పాఠశాలల కన్వీనర్ మేఘారావు అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్యాల బీసీ గురుకుల పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-17 క్రీడా పోటీల విజేతలకు ప్రిన్సిపల్ గురువయ్యగౌడ్‌తో కలిసి ఆయన బహుమతులు అందజేశారు. ఓవరాల్ ఛాంపియన్‌గా మక్తల్ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు నిలిచారు. మక్తల్ గురుకుల పాఠశాల విద్యార్థి జి.శివ వ్యక్తిగత ఛాంపియన్ షిప్ బహుమతి అందుకున్నారు. కబడ్డీలో ప్రథమ స్థానంలో నవాబ్‌పేట గురుకుల పాఠశాల, ద్వితీయ స్థానంలో మక్తల్, ఖోఖోలో నవాబ్‌పేట ప్రథమ, ద్వితీయ చిట్యాల, వాలీబాల్‌లో మక్తల్ ప్రథమ, సీసీ కుంట ద్వితీయ, టెన్నికాయిట్‌లో చిట్యాల ప్రథమ, ద్వితీయ బూర్గుపల్లి గురకుల పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. చదరంగం పోటీల్లో కడుకుంట్ల ప్రథమ, కేటీ దొడ్డి ద్వితీయ, క్యారమ్స్‌లో సింగోటం ప్రథమ, కడుకుంట్ల ద్వితీయ, డిస్క్ త్రోలో మంజునాథ్ ప్రథమ (ధర్మాపూర్), ద్వితీయ డి.జయంత్ (చిట్యాల), షాట్‌పుట్‌లో ప్రథమ పి.రవీందర్ (చిట్యాల), ద్వితీయ వినయ్ (మక్తల్), హైజంప్, లాంగ్‌జంప్‌లో ప్రథమ కె.అఖిల్‌గౌడ్ (కేటీ దొడ్డి), ద్వితీయ జి.శరత్ (కల్వకుర్తి) నిలిచారు. 400 మీటర్ల రిలే పరుగు పందెంలో ప్రథమ స్థానంలో అంబటి పల్లి గురుకుల విద్యార్థులు, ద్వితీయ స్థానంలో మక్తల్ విద్యార్థులు, 800 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో జి.శివ(మక్తల్), ద్వితీయ స్థానంలో చందు (చిట్యాల), 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ జి.శివ (మక్తల్), ద్వితీయ జి.శరత్ (కల్వకుర్తి), 3 కి.మీ. ప్రథమ కార్తిక్ (అంబటిపల్లి), ద్వితీయ వంశీ (నవాబ్‌పేట), 100 మీటర్లలో ప్రథమ భీముడు (అంబటిపల్లి), ద్వితీయ జి.శివ (మక్తల్), 200 మీటర్లలో ప్రథమ జి.శివ (మక్తల్), ద్వితీయ శరత్ (కల్వకుర్తి), 400 మీటర్లలో ప్రథమ శరత్ (కల్వకుర్తి), ద్వితీయ జి.శివ (మక్తల్) నిలిచారు.

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మదనేశ్వర్ రెడ్డి, ఈవో పురేందర్, ఆలయ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త మండలి సభ్యుల సమక్షంలో వేలం పాటలు నిర్వహించారు. మొత్తం రూ.3,35,82,000 ఆదాయం వచ్చినట్లు ఈవో వెల్లడించారు. గతేడాది రూ.1.76 కోట్లతో పోలిస్తే ఈ సారి దాదాపు రెట్టింపు వచ్చినట్లయింది. వేలం పాటలో 40 మందికి పైగా పాల్గొన్నారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి వేలంపాట అత్యధికంగా రూ.1.27 కోట్లు పలికింది. వాహన పార్కింగ్ రూ.77 లక్షలు, చీరలకు రూ.91 లక్షలు, ఫొటోలు, క్యాసెట్లు, పుస్తకాలకు రూ.22 లక్షలు, దేవస్థాన వసతి భవన నిర్వహణకు రూ.9.50 లక్షలు, శౌచాలయాల నిర్వహణకు రూ.7.20 లక్షలు, క్యాంటీన్ నిర్వహణకు నెలకు రూ.76 వేలకు పాటదారులు పాడుకున్నారు. పాట దక్కించుకున్న వారు నవంబరు 24వ తేదీ లోగా 50 శాతం డబ్బులు చెల్లించి డిసెంబరు 1వ తేదీ నుంచి ఆలయాల వద్ద విక్రయాలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఈవో వివరించారు.

వేలం పాటలతో ఆలయాలకు రూ.3.35 కోట్ల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

శ్రీపబ్బతి ఆంజనేయస్వామి ఆలయానికి ..

పదర(అమ్రాబాద్), న్యూస్‌టుడే : మద్దిమడుగు శ్రీపబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో కొబ్బరికాయల విక్రయం వేలం మహబూబ్‌నగర్‌లోని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. అచ్చంపేటకు చెందిన వ్యాపారి నర్సిరెడ్డి రూ.48 లక్షలకు వేలం దక్కించుకున్నారు. అయితే గతేడాది రూ.40.52 లక్షలు పలికింది. కొబ్బరి చిప్పలు, తలనీలాల సేకరణకు సరైన వేలం రాకపోవటంతో వాయిదా వేశారు. త్వరలో మరో తేదీని ఖరారు చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఈవో రంగాచారి, పాలక మండలి ఛైర్మన్ రాములు నాయక్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫారంలో	115-00
రిటైల్	137-00
డ్రెస్ట్	199-00
స్కిన్‌లెస్	226-00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ.10 గం. నుంచి మ.1 వరకు

మహబూబ్‌నగర్: 9948145978 జడ్చర్ల: 8008573899
దేవరకద్ర: 9000031648 భూత్పూర్: 8008563143

సమస్య: దేవరకద్ర మండలంలోని నాగారం గ్రామంలో పగలు దీపాలు వెలగడంతో విద్యుత్తు వృథా అవుతుంది. విద్యుత్తు స్తంభాలకు ఆన్‌ఆఫ్ బటన్ ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించాలి. - రవి, నాగారం

సమాధానం: విద్యుత్తు స్తంభాలకు ఆన్‌ఆఫ్ బటన్ ఏర్పాటు చేసి విద్యుత్తు వృథాను అరికట్టేలా చర్యలు తీసుకుంటాం. - శ్రీకాంత్ ఏఈ దేవరకద్ర

- న్యూస్‌టుడే, దేవరకద్ర గ్రామీణం

తెరపై ఈనాడు

శ్రీనివాస - విశ్వం, తిరుమల - వెట్టయాన్, బాలాజీ - పొట్టేల్, వెంకటేశ్వర - దేవర, వెంకటాద్రి - లగ్గం, మైత్రి శ్రీకృష్ణ - వెనమ్ త్రీడీ (తెలుగు)
(-న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం)

యువతకు బాసటగా శిక్షణ కేంద్రాలు

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువత ఆలోచన విధానంలో మార్పు తీసుకు రావాలని, ఉపాధి కల్పనతో వారికి బాసటగా నిలవాలనే నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని బీఎన్‌రెడ్డికాలనీలోని రెడ్డి బాలికల వసతిగృహంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సొంత నిధులతో 'సెట్విన్' పర్యవేక్షణలో 'పవర్ మహబూబ్‌నగర్' పేరిట ఏర్పాటు చేసిన ఉపాధి శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరుద్యోగ యువతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి కల్పన, ఉద్యోగాల భర్తీకి పెద్దపీట వేస్తోందన్నారు. యువత ఒకరి చేతి కింద పనిచేయడం మానేసి సొంతంగా యూనిట్లు స్థాపించేలా ఎదగాలని లక్ష్యంతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సొంత నిధులతో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లోని యువతను అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో ఉంచడమే తన లక్ష్యమన్నారు. యువతీ, యువకులు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 'మయూరి బ్రాండ్' పేరిట


బీఎన్‌రెడ్డికాలనీలోని రెడ్డి బాలికల వసతిగృహంలో ఏర్పాటు చేసిన ఉపాధి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి డి.శ్రీధర్‌బాబు. చిత్రంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి, పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

రూపొందిన సీతాఫలాల ప్యాకెట్లను ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, సెట్విన్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ముడా ఛైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ బెక్కరి అనిత, పురపాలక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించండి

మహబూబ్‌నగర్ గ్రామీణం: స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. శుక్రవారం ఆయన దివిటిపల్లి సమీపంలోని ఐటీ కారిడార్‌ను ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించారు. అక్కడి ఐటీ టవర్‌ను చేరుకొని ఏయే కంపెనీల కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయో తెలుసుకున్నారు. కంపెనీల్లో పనిచేస్తున్న పలువురు యువతీ యువకులతో మాట్లాడి వారి వేతనాలు, హోదాలు తెలుసుకున్నారు. ఐటీ టవర్ పైభాగంలో ఉన్న అమరరాజా కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి స్థానికులకు బ్యాటరీ పరిశ్రమలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. ఐటీ కారిడార్ ఏర్పాటు సందర్భంగా రైతుల నుంచి సేకరించిన భూమి వివరాలు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఐటీ మంత్రికి వివరించారు. ఇంకా కొంత మంది రైతులకు పరిహారం అందలేదన్నారు. స్పందించిన మంత్రి వెంటనే భూసేకరణ వివరాలు తీసుకుని ఇంకా ఎంత మంది రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదో పరిశీలించి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

27న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27న జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శంకర్‌నాయక్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అండర్-14 ఖోఖో ..

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) అండర్-14 ఉమ్మడి జిల్లా ఖోఖో టోర్నీలో పాల్గొనే మహబూబ్‌నగర్ జిల్లా బాల, బాలికల జట్లను ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ మైదానంలో ఉదయం 8 గంటలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి శుక్రవారం తెలిపారు. బోనఫైడ్, ఆధార్‌తో ఎంపికలకు హాజరుకావాలని సూచించారు.

29న ఎస్‌జీఎఫ్ అండర్ -14, 17 కబడ్డీ ..

ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ టోర్నీ కోసం మహబూబ్‌నగర్ జిల్లా అండర్-14, 17 కబడ్డీ బాల, బాలికల జట్లను ఈనెల 29న బాదేపల్లిలో జిల్లా బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపికలు చేపడుతున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి శుక్రవారం తెలిపారు. అండర్-14 బాలురు 51 కిలోలు, బాలికలు 48 కిలోలు ఉండాలని, అండర్-17 బాలురు 55 కిలోలు, బాలికలు 55కిలోలకు మించి ఉండరాదని పేర్కొన్నారు. బాదేపల్లి మైదానంలో పీడీ రాంకళ్యాణ్‌కు నివేదించాలని సూచించారు.

క్రమబద్ధీకరణకు స్థలాల పరిశీలన


వివరాలు సేకరిస్తున్న జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: పోలేపల్లి, మాచారం గ్రామాల్లో శుక్రవారం జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి పర్యటించారు. జీపీ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పనితీరుపై పర్యవేక్షణ చేశారు. గతంలో కొనుగోలు ప్లాటు యజమానులు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసిన వారందరూ సంబంధిత కార్యదర్శితో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించి మీ ప్లాటు దస్తావేజులు, ఈసీ అప్లోడ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి కృషి చేయండి


వీసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: కళాశాలకు అటానమస్ హోదా లభించిందని కళాశాలలో అదనపు గదుల నిర్మాణానికి కృషి చేయాలని ప్రిన్సిపల్ డా.సుకన్య కోరారు. జడ్చర్ల డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం పాలమూరు విశ్వవిద్యాలయంలో నూతనంగా వచ్చిన వీసీ శ్రీనివాసులును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు ఇన్నారెడ్డి, సులేమాన్, రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచండి

జడ్చర్ల, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉపాధి హామీ పనులు వేగం చేసి కూలీలకు ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అధికారులను కోరారు. జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవోలు, ఉపాధిహామీ పథకం ఏఈవోలు, సాంకేతిక సహాయకులు ఇతర సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది జరిగిన పనులతో పోలిస్తే ఈ ఏడాది ఉపాధి కూలీలకు తక్కువ పనులు కల్పించారని వాటి వివరాలను అధికారుల నుంచి వివరాలు సేకరించారు. గత భారాస ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ నిధులను మళ్లీంచడంతో కూలీలకు సరిగా పనులు జరగలేదని, జరిగినా సకాలంలో వారికి కూలీ డబ్బులు అందజేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కూలీలకు త్వరగా డబ్బులు చెల్లించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బాలానగర్‌లో నిర్మించిన వైకుంఠ ధామాన్ని కొందరు నాయకుల సహకారంతో కూల్చివేశారని వారిపై ఎందుకు కేసు పెట్టలేదని అధికారులను ప్రశ్నించారు. ఇక మీదట అధికారులు ఉపాధిహామీ పనులను వేగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎంపీడీవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు: ఎమ్మెల్యే

అడ్డాకుల, న్యూస్‌టుడే: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం అందించే బోనస్ పొందాలని సూచించారు. మూసాపేట మండలంలోని జానంపేట, కొమిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయని తెలిపారు. ధాన్యం కొనుగోలులో పూర్తిగా పారదర్శకంగా రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో శెట్టిశేఖర్, శ్రీహరి, బగ్గికృష్ణయ్య, విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య, రాంకుమార్‌యాదవ్, చెన్నమ్మ, వెంకటేశ్, రాంచంద్రారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.


జానంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

గొర్రెల పరిశోధన కేంద్రాన్ని కాపాడాలని వినతి

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే: గొర్రెల పరిశోధన కేంద్రాన్ని కాపాడాలని ఓయూ జేఏసీ నాయకులు పాండు, వెంకటేశ్, శ్రీనివాస్, రాములు, ప్రవీణ్‌కుమార్ తదితరులు శుక్రవారం పరిశోధన కేంద్రం హెడ్ డా.అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. 1953లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం 355 ఎకరాలతో కూడుకొని ఉంటే ఇప్పుడు దానిని వివిధ రకాల ప్రభుత్వ కార్యాలయాలకు పంచడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయని వారు తెలిపారు. 20 ఎకరాలు కోర్టుకు మిగతా స్థలం చించోలి రహదారికి పోయిందని తద్వారా ఇక్కడ గొర్రెల పరిశోధన కేంద్రానికి తీవ్ర ముప్పు ఏర్పడిందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని పెంపకం దార్ల ప్రయోజనాలు కాపాడాలని వారు కోరారు.

ధర్మయుద్ధ మహాసభను జయప్రదం చేయండి

బాలానగర్, న్యూస్‌టుడే: జడ్చర్లలో ఈనెల 30న నిర్వహించనున్న ధర్మయుద్ధ మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌ఛార్జి జంగయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని తెలిపారు. నాయకులు యాదయ్య, జంగయ్య, వెంకటయ్య, అశోక్, విక్రమ్, ఆదిత్య తదితరులున్నారు.

కళాశాల యాజమాన్యం వేధిస్తున్నారని ఫిర్యాదు

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే: పరీక్ష ఫీజులు తీసుకోకుండా పట్టణంలోని ఓ కళాశాల యాజమాన్యం తమను వేధింపులకు గురిచేస్తున్నారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు శుక్రవారం కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఉపకార వేతనాలు ఆలస్యం కావటంతో కళాశాల యాజమాన్యం ఖాతాల్లో డబ్బులు పడలేదని, ఇదే అదనుగా భావించిన యాజమాన్యం తమను వేధింపులకు గురిచేస్తోందని వాపోయారు. ఈనెల 28న పరీక్ష ఫీజు చివరి అవకాశం ఉన్నదని, తల్లిదండ్రులను తీసుకొచ్చి పరీక్ష ఫీజు మొత్తం చెల్లించాలని యాజమాన్యం డిమాండ్ చేస్తోందని కలెక్టర్‌తో చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ కళాశాల యాజమాన్యంతో మాట్లాడి పరీక్ష ఫీజు కట్టించుకునేలా చర్యలు తీసుకుంటానని విద్యార్థులకు విద్యార్థులకు హామీ ఇచ్చారు.

మానసిక ప్రశాంతత కీలకం

గండీడ్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతతను అలవర్చుకోవాలని అధ్యాత్మిక వక్త, స్వామిజీ రఘోత్తమాచార్యులు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామంలో ధర్మజాగరణలో కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార, వ్యవహారాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ధర్మ జాగరణ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నల్లా బిల్లుల వసూళ్లు నిలిపేయాలని డిమాండ్

భూత్పూర్, న్యూస్‌టుడే: భూత్పూర్ పురపాలక సంఘం పరిధిలో నల్లా బిల్లుల వసూళ్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ భారాస శ్రేణులు ధర్నా చేపట్టారు. స్థానిక పుర కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారాస ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు నీటి బిల్లులు రద్దు చేశారని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లుల పేరుతో ప్రజల నుంచి మూడేళ్ల నల్లా బిల్లులు వసూలు చేస్తోందని ఆరోపించారు. అనంతరం నీటి బిల్లుల వసూళ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని పుర కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, బాలకోటి, రామకృష్ణ, కో ఆప్షన్ అజీజ్, నాయకులు పాల్గొన్నారు.


భూత్పూర్ పురపాలిక వద్ద ధర్నాలో మాట్లాడుతున్న సీనియర్ నాయకులు మురళీధర్‌గౌడ్

ఫార్మా కంపెనీల కాలుష్యంపై చర్యలు తీసుకోండి

జడ్చర్ల, న్యూస్‌టుడే: ఫార్మా పరిశ్రమల నిర్వాహకులు కాలుష్యం నీటిని నీటిని బయటకు వదలడంతో పంటలు పాడై, చెరువు నీరు కలుషితమవుతుందని శాసనసభలో ప్రస్తావించినా అధికారులు చర్యలు తీసుకోలేదని, చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి లేఖ రాశారు. జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయనకు పలువురు రైతులు కాలుష్యంపై ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ విషయంపై మరోమారు స్పీకర్‌కు లేఖ రాసినట్లు ఎమ్మెల్యే విలేకర్లకు వెల్లడించారు. ఫార్మా కంపెనీలు కలుషిత కాలుష్యం నీటిని బయటకు వదలడం తగదన్నారు. ఒక వేళ ఇలాగే వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే: మహమ్మదాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డా.పద్మ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గత నెల 25న 'నామమాత్రంగా వైద్యసేవలు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వార్డులను పరిశీలించారు. సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు విధులకు హాజరు కాకపోవడంతో సంజాయిషీ కోరతానని తెలిపారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డా.మహాలక్ష్మి, ఏఎన్ఎం లలిత, ఫార్మాసిస్టు శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.


రోగులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డా.పద్మ

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గండీడ్, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కొంరెడ్డిపల్లి నుంచి హన్వాడ మండలం శేక్‌పల్లి వరకు బీటీరోడ్డును మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మండల కేంద్రంలో నూతన కేజీబీవీ పాఠశాల భవనం, సల్కర్‌పేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం, వెన్నాచేడ్, సాలానగర్ ప్రాజెక్ట్‌లో చేపల వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు తీసుకువచ్చి గ్రామాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎల్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, గండీడ్, మహమ్మదాబాద్ మండలాధ్యక్షులు జితేందర్‌రెడ్డి, కెఎంనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పుల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రావు, ఆశన్న, ఆశిరెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


గండీడ్‌లో కేజీబీవీ భవనానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

నియంత్రిక చుట్టూ పిచ్చి మొక్కలు తొలగింపు

జడ్చర్ల న్యూటౌన్, న్యూస్‌టుడే: మిడ్జిల్ మండలం మసిగుండ్లపల్లి గ్రామంలో నియంత్రిక చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో సరఫరాకు ఇబ్బందికరంగా మారిందని ఇటీవల 'ఈనాడు' దినపత్రికలో ప్రమాదకరంగా నియంత్రిక పేరిట వచ్చిన కథనానికి విద్యుత్తుశాఖ అధికారులు స్పందించారు. నియంత్రిక చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో తరచూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుండటంతో గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మేరకు అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు తొలగించారు.

108 ఈఎంటీ చొరవతో సాధారణ కాన్పు

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: హన్మసానిపల్లి గ్రామానికి చెందిన మానసకు శుక్రవారం పురిటినొప్పులతో బాధపడుతుండగా భర్త శివశంకర్ 108కు ఫోన్ చేశారు. 108 అక్కడికి చేరుకున్న సమయానికి మహిళకు పురిటినొప్పులు అధికం కావడంతో బాధితురాలికి ఇంట్లోనే సాధారణ కాన్పు చేశారు. మానస పండంటి ఆడబిడ్డ జన్మించినట్లు చెప్పారు. ప్రసవానంతరం తల్లీ బిడ్డలను నవాబ్‌పేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించినట్లు 108 ఈఎంటీ మెహబూబ్‌బాష చెప్పారు.

పంచాయతీ కార్యదర్శులు సంఘటితమవ్వాలి

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్) న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు సంఘటితం కావాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్‌లోని టీఎన్జీవో భవనంలో శుక్రవారం జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించిన అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు రాజీవ్‌రెడ్డి, చంద్రనాయక్, ఎన్నికల అధికారి పి.కృష్ణమోహన్ మాట్లాడారు. ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు చేరవేయడంలో కార్యదర్శుల పాత్ర ముఖ్యమన్నారు. నూతన అధ్యక్షుడిగా కె.జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షుడిగా టి.రవీందర్‌రెడ్డి, కార్యదర్శిగా వి.రవికుమార్, సంయుక్త కార్యదర్శిగా కె.శ్వేత, కోశాధికారిగా జి.కృష్ణయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా సతీష్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా కె.శ్రీకాంత్, సభ్యులుగా టి.మోహన్‌బాబు, బి.సుభద్రలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ బాధ్యులను పలువురు సన్మానించారు.

చేతికి వచ్చే వేళ.. చేను ఎండిపోయే దైన్యం

ఈ చిత్రంలోని రైతు పేరు చెన్నయ్య. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కాకర్లపాడు గ్రామం. వ్యవసాయమే అతడి కుటుంబానికి జీవనాధారం. తనకున్న అర ఎకరాలో వరి సాగు చేశారు. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. తన చేనుకు ఆసరాగా ఉన్న ఒక్క బోరు (290 అడుగుల లోతు) రెండు రోజుల కిందట మట్టి కూలి పూడుకు పోయింది. బోరు నుంచి నీరు రాకపోవడంతో పూడిక తీసే యంత్రాన్ని తెప్పించారు. బోరులో పేరుకున్న పూడిక తొలగించే ప్రయత్నం ఫలించలేదు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో పంట బాగా వచ్చిందని, మరొక నీటితడిని అందిస్తే పంట చేతికి వస్తుందని రైతు ఆశలు పెట్టుకున్నారు. ఈ దశలో ఇలా జరగడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కాపు కొచ్చిన పంటను దక్కించుకోవాలంటే మరో బోరు తవ్వక తప్పదని, ప్రస్తుతం తను ఉన్న పరిస్థితుల్లో తలకు మించిన భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.



– ఈనాడు, మహబూబ్‌నగర్

అధికారులే ఆదుకోవాలి

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే: మండలంలోని కంచన్‌పల్లిలో మహిళా సంఘాల సభ్యులకు తెలియకుండా వీబీకే బ్యాంకులో రుణం తీసుకున్నారని మహిళా సంఘం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పని చేసిన వీబీకే బ్యాంకులో రుణం తీసుకున్నారని తీసుకున్న రుణానికి బ్యాంకు అధికారులు మా ఖాతాలు హోల్డ్‌లో పెట్టారని సభ్యులు ఆరోపించారు. బ్యాంకు డబ్బులు చెల్లించాలని వీబీకే మీద ఒత్తిడి తేగా కొంత మొత్తం చెల్లించారని, మిగతా డబ్బులకు మూడు నెలల గడువు కోరిందని 8 నెలలైనా డబ్బులు చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి డబ్బులు రికవరీ చేసి ఆదుకోవాలని కోరారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఏపీయం సునీతను వివరణ కోరగా వీబీకే అందుబాటులోకి రావడం లేదని, విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని రికవరీ అయ్యేలా చూస్తామన్నారు.


ఏపీఎంతో మాట్లాడుతున్న డ్వాక్రా మహిళలు

సీతమ్మతండాలో నీటి ఎద్దడి

నవాబ్‌పేట, న్యూస్‌టుడే : నవాబ్‌పేట మండలం సీతమ్మతండాలో మూడు నెలల నుంచి తీవ్ర నీటిఎద్దడి నెలకొందని తండావాసులు తెలిపారు. తండాకు మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కోసం తండా సమీపంలోని వ్యవసాయ బోర్ల నుంచి తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. నీటిఎద్దడి కారణంగా తండాలోని వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తండాకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సమీఉల్లాఖాన్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా మిషన్ భగరథ ఏఈ సెలవుపై వెళ్లారని, సమస్యను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


వ్యవసాయ బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్న తండావాసులు

గుంతల రోడ్డుతో అవస్థలు


గుండేడ్ సమీపంలో గుంతలమైన రోడ్డు

బాలానగర్, న్యూస్‌టుడే: మండల కేంద్రం నుంచి ఉడిత్యాల వరకు ప్రధాన రహదారిలో పలు చోట్ల గుంతలు ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళలో ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు గుంతలు గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ సమస్యపై 'న్యూస్‌టుడే' పంచాయతీరాజ్ డీఈఈ వెంకటేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా సమస్యలను పరిశీలించి వెంటనే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయిస్తామన్నారు.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత.. మిడ్జిల్, న్యూస్‌టుడే: మండలంలోని మున్ననూరు గ్రామ శివారులోని దుందుభి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని స్థానికుల సమాచారం మేరకు సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు.. బాలానగర్, న్యూస్‌టుడే: మండలంలోని ఓ తండాకు చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై మండల కేంద్రం నుంచి వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి కిందపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

దాడి ఘటనలో కేసు నమోదు.. అడ్డాకుల, న్యూస్‌టుడే: వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కన్మనూరు గ్రామానికి చెందిన మన్యపురెడ్డి గురువారం తన ఇంటి ముందు ఉన్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన తాజ్ పలుమార్లు మన్యపురెడ్డి ఇంటి ముందు నుంచి అనుమానాస్పదంగా తిరిగాడు. ఎందుకు తిరుగుతున్నావని ప్రశ్నించడంతో మన్యపురెడ్డిపై దుర్భాషలాడుతు తాజ్ కర్రతో దాడి చేశాడు. దీంతో మన్యపురెడ్డి తలకు గాయమైంది. శుక్రవారం బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కారు-ద్విచక్ర వాహనం ఢీ.. ఒకరికి గాయాలు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: కారు-ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు బైపాస్ వద్ద శుక్రవారం రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనాన్ని కారు బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు సమీపంలో ఉన్న ఎస్‌వీఎస్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు నారాయణపేటకు చెందిన ఓ వైద్యుడికి చెందినట్లు తెలుస్తోంది. ఈ విషయమై 'న్యూస్‌టుడే' గ్రామీణ ఠాణా ఎస్సై విజయ్‌కుమార్‌ను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

విద్యుత్తు తీగల చోరీ.. జడ్చర్ల, న్యూస్‌టుడే: జడ్చర్లకు చెందిన రైతు మహిపాల్‌రెడ్డికి మండలంలోని బండమీదిపల్లి గ్రామ సమీపంలో పొలం ఉంది. అక్కడ బోరు మోటారు కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం చోరీ చేశారు. దాదాపు 5 స్తంభాలకు ఉన్న తీగలను చోరీ చేసినట్లు బాధిత రైతు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం సీసాలు ధ్వంసం చేసిన అధికారులు

జడ్చర్ల, న్యూస్‌టుడే: మద్యం సీసాల లోడుతో ఉన్న లారీని మరో వాహనం ఢీకొనడంతో బోల్తాపడిన విషయం విదితమే. 500 కాటన్‌ల మద్యం ప్లాస్టిక్ బాటిళ్లు కింద పడటంతో వాటిని జాతీయ రహదారి 44 జడ్చర్ల పురపాలికలోని బురెడిపల్లి సర్వీసు రోడ్డులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు లారీతో తొక్కించి ధ్వంసం చేశారు. దీనిని చూసేందుకు జనం ఎగబడ్డారు. ఈ నెల 23న పెబ్బేరు సమీపంలోని శ్రీరంగాపూర్ మద్యం గిడ్డంగి నుంచి రంగారెడ్డి జిల్లాలో ఉన్న స్టాక్ పాయింట్‌కు మద్యం తరలిస్తున్న లారీ పై వంతెన వద్ద ఆగి ఉండగా వెనక వైపు నుంచి మరో లారీ వచ్చి ఢీకొట్టింది. దీంతో మద్యం కాటన్‌లు, వాటిలో ఉన్న బాటిళ్లు కింద పడ్డాయి. కింద పడిన బాటిళ్లను వినియోగించవద్దని నిబంధన ఉండటంతో వాటిని ధ్వంసం చేసినట్టు జడ్చర్ల ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి తెలిపారు. సర్వీసు రోడ్డుపై ధ్వంసం చేయడాన్ని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు బాటిళ్ల వ్యర్థాలను అక్కడి నుంచి తరలించారు. మద్యం వాసన రాకుండా తగు చర్యలు తీసుకున్నారు.


జాతీయ రహదారి–44 బురెడిపల్లి సర్వీసు రోడ్డులో మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

తప్పిపోయిన మహిళ అప్పగింత

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: తప్పిపోయి సూర్యాపేట చేరిన మహిళ మహిళా శిశు సంక్షేమ శాఖ 'సఖి' కేంద్రం సిబ్బంది సహకారంతో తిరిగి బంధువుల చెంతకు చేరింది. శుక్రవారం మహబూబ్‌నగర్ 'సఖి' కేంద్రంలో తప్పిపోయిన వెంకటమ్మను ఆమె చెల్లెలి కుమారుడికి అప్పగించినట్లు జిల్లా సంక్షేమాధికారి జరీనా బేగం తెలిపారు. జిల్లా కేంద్రం షాసహబ్‌గుట్టకు చెందిన వెంకటమ్మ బంధువుల వివాహానికి వెళ్తున్నానని చెప్పి తప్పిపోయి సూర్యాపేటకు చేరుకోగా అక్కడి సఖి సిబ్బంది కృషితో ఇక్కడి అధికారులు బంధువుల చిరునామా తెలుసుకొని అప్పగించారు.


వెంకటమ్మను బంధువుకు అప్పగిస్తున్న సఖి కేంద్రం సిబ్బంది